విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా



నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకుంటాం: మంత్రి

విశాలాంధ్ర-మనుబోలు: మాండౌస్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నా రు. బుధవారం ఆయన మనుబోలు మండలం వీరంపల్లి గ్రామంలో దెబ్బ తిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తుపాన్ కారణంగా వ్యవసాయ ఉద్యాన పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం ఉదారంగా ఆదుకుంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారని వర్షాలు తగ్గాక పొలాలను పరిశీలించి అంచనాలు తయారు చేసి వెంటనే రైతులను ఆదుకుంటామన్నారు. నారు ముళ్ళు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీతో అన్ని రకాల విత్తనాలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో కొందరు టీడీపీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు.పంట నష్టాన్ని అంచనా వేయక ముందే రైతుల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం 716కోటపైగా బీమా ఎగ్గొట్టిపోతే వైసిపి ప్రభుత్వం చెల్లించిందని పేర్కొన్నారు. మాండోస్ తుఫాన్ కారణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వలన ఎలాంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం కలగలేదని వివరించారు. తుఫానులను నిలిపేంత టెక్నాలజీ చంద్రబాబు వద్ద ఉందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఉదారంగా ఆదుకోవడం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రైతులకు సంబంధించి ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉదారంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.రాబోయే వారం రోజుల్లో మరో తుపాన్ ముప్పు ఉందని అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి ,నెట్ క్యాబ్ చైర్మన్ దాసరి భాస్కర్ గౌడ్, ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్ రెడ్డి,నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, ఎడెం మల్లికార్జున్ రెడ్డి, మహేంద్ర వర్మ ,సురేంద్ర రెడ్డి ,సర్వేపల్లి నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ గుంజి రమేష్, చాన్ బాషా, అధికారులు డిఈ చంద్రశేఖర్, కార్తీక్ ,హౌసింగ్ ఏఈ రవికుమార్ , ఏపీ ఓ రాజమ్మ ,ఏపిఎం వనజాక్షి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బందితో సమీక్ష

విశాలాంధ్ర- ఉదయగిరి: మండల పరిధిలోని గండి పాలెం ప్రాథమిక వైద్యశాలలో సీతారాంపురం గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది తో బుధవారం జిల్లా క్షయ కుష్ఠ ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జి వెంకట ప్రసాద్ సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కేవైసీని త్వరత గతిన 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు వాలంటీర్ల సమన్వయంతో లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. గర్భిణీలకు బాలింత లకు చిన్నారులకు వ్యాధి నివారణ టీకాలు అందించాలన్నారు. అనీమియా ముత్తు భారత్ పోస్టర్లు ఆరోగ్య కేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు. ఈ ప్రక్రియలో గర్భవతులను చిన్నారులను నమోదు చేయలేదని వెంటనే నమోదు చేయాలని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎల్సిడిసి సర్వేసును సర్వేసును ప్రతి పగృహం ను సందర్శించి అక్కడికి నందిగా సర్వే చేయాలన్నారు . అనుమానిత కేసులను గుర్తించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి ఇంటి దగ్గరే పరీక్షించి క్రమం తప్పకుండా వైద్యం అందించాలన్నారు. క్షయ అనుమానిత యాదిగ్రస్తులను ఏఎన్ఎంలకు ఆశా కార్యకర్తలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రతినెల గల్ల పరీక్ష చేయాలన్నారు. క్షయ నియంత్రణ కేంద్రాన్ని ప్రాథమిక వైద్యశాలలో ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గండిపాలెం వైద్యాధికారిణి డాక్టర్ శివ కల్పన , సిహెచ్ఓ శివ కుమారి, ఆరోగ్య విద్యాధికారి వెంకటసుబ్బయ్య, పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ చైర్మన్‌ను కలిసిన వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ని పేర్నాటి కలిసిశారు. ఈరోజు తాడేపల్లిలో ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యకుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుని కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహకరించాలని వైసీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి కోరారు. పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి తూర్పు రాయలసీమ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగు లతో పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి జిల్లాల వారీగా సమా వేశాలు ఏర్పాటు చేయించాలని బొప్పరాజు వెంకటేశ్వర్లుని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యకు డు బొప్పరాజు వెంకటేశ్వర్లు సమాధానం ఇస్తూ తూర్పు రాయలసీమలోని కొత్త 6 జిల్లాలకు సంబంధించి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు భాధ్యత తీసుకొని సమావేశాలను ఏర్పాటు చేయిస్తామని, మా రెవెన్యూ అసోసియేషనుకి సంబంధించి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్సీ అభ్యర్థికి బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని వెంగళరావు నగర్‌లో శ్రీ పొట్టిశ్రీరాములు మునిసి పల్ పాఠశాలలోని విద్యార్థులకు పెడు తున్న మధ్యాహ్న భోజనాన్ని బుధవారం కావలి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎం. హరిప్రసాద్ తనిఖీ చేశారు. భోజన నాణ్యతను, కోడిగుడ్డు సైజ్ ను, చిక్కీలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసి, ప్రతిరోజు ఇలాగే అందివ్వాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంఈవో కె. శ్రీధర్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మెన్. గోళ్ళ అమర జ్యోతి, వైస్ చైర్మన్, సయ్యద్ ఘనీబాషా, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కావలి : పట్టణం లోని ఇందిరమ్మ కాలనీ కి చెందిన షేక్ అబ్దుల్లా, కరీమా దంపతు లకు బిఎంఆర్ చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రూ. 50 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా అబ్దుల్లా ఆత్మహత్య చేసుకున్నాడు. అబ్దుల్లా భార్య కరీమా అనారోగ్యంతో మంచంలోనే ఉంది. ఈమెకు ముగ్గురు కూతుర్లు కావడం, వైద్యానికి, మందులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని నూర్ బాషా సంఘం ప్రతినిధులు రాజసభ సభ్యులు బీద మస్తాన్ రావు తెలిపి ఈ సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమములో నూరుబాషా సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ సలీమ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఖదర్ బాషా, బాబర్ జాన్, హుస్సేన్ సాహెబ్, మహబూబ్ బాషా, షేక్ ఖలీల్, చాంద్ బాషా మస్తాన్, గౌస్ బాషా, మస్తాన్ వలి, షానవాజ్, అహమద్ బాషా, కాలేమస్తాన్ పాల్గొన్నారు

చెప్పిన దానికంటే సంక్షేమం ఎక్కువ చేసిన సీఎం జగన్: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కోవూరు: ఏపీ సీఎం జగన్ మోహనరెడ్డి ఎన్నికలు ముందు పాదయాత్ర లో ప్రజలకు ఇచ్చిన మాట కంటే ఎక్కువ సంక్షేమాలు చేపట్టిన ఘనత జగన్‌కే సాధ్యం అని మాజీ మంత్రి. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి అన్నారు. కోవూరు పట్టణములోని పడుగుపాడు లక్ష్మి నారాయణ పురం బీడీ తదితర కాలనీ లో గడప గడప లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ఆదేశాలు ప్రకారం నియోజకవర్గం లో ఇప్పటి వరకు 41,వేల 196గడప లు,40సచివాలయం లు పర్యటించారు. ఈ నేపథ్యంలో తాతలు అవ్వలు, వితంతు వులకు పలు సంక్షేమాలు అర్హులైన వారికి అందుతున్నాయా లేదా అనే అంశాలను గడప గడప లో అరా తీశారు . ఏ రాష్ట్రంలో అమలు చెయ్యని సంక్షేమాలు వైసీపీ ప్రభుత్వం చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు జగన్ చేసే అభి వృద్ధిని ఓర్వలేక నే ఎల్లో మీడియా వైసీపీ ప్రభుత్వం పై ఆరోపణలు చేస్తుందని జగన్ ను ఏమి పీక లేరన్నారు అన్ని పార్టీలకు చెందిన వారు వైసీపీ ప్రభుత్వం లో లబ్ది పొంది ఉన్నారని, వీరందరు రానున్న రోజుల్లో వైసీపీ కె మొగ్గు చూపుతారానే నమ్మకం తనకు ఉందని ప్రసన్న అన్నారు. పైకి చెప్పలేక ప్రజలు తమకే పట్టం కడతారని గుర్తు చేసారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ ఫలాలు ను అందించిన నగదు మొత్తం 1లక్ష 75వేలకోట్లు రూపాయలు ను ఇచ్చిన ఘనత వైస్ జగన్ మోహనరెడ్డి కె సాధ్యపడిందని ఎమ్మెల్యే చెప్పారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అనారోగ్యం తో బాధ పడుతూ పలు ఆసుపత్రిలో వైద్యం చేయించు కొన్న నలుగురు బాధితులకు బుధవారం గడప గడప లో ఎమ్మెల్యే ప్రసన్న చేతులు మీదుగా చెక్కులను అందించారు. కొడవలూరు మండలం లో గంగ పట్నం శ్రీనివాసులుకు 10లక్షల రూపాయలు సీఎం నిధి, ఇందుకూరు పేట మండలం లో నక్క కృష్ణ కు 90వేల రూపాయలు, మరో మండలం కు చెందిన అవిజ్ఞ కు 4లక్షలు రూపాయలు చెక్కులను ఎమ్మెల్యే అందించారు. దీనిపై బాధితులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో డిఏఏబి చైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్ రెడ్డి. డీసీఎంఎస్ చైర్మెన్, వీరి చలపతి రావు. డిఎల్‌డిఏ డైరెక్టర్ కాటం రెడ్డి దినేష్ రెడ్డి. జడ్పీటీసీ శ్రీలత ఎంపీపీ పార్వతి. వైస్ ఎంపీపీ శివుని నరసింహులు రెడ్డి. సీఏసీఎస్ చైర్మెన్ మల్లి కార్జున రెడ్డి ఏఎంసీ చైర్మెన్ పచ్చిపాల రాధకృష్ణ రెడ్డి. మత్స్య కార వైసీపీ నేత ఆవుల వాసు, పడుగు పాడు వైస్ ప్రెసిడెంట్ అహమ్మద్, సర్పంచ్ లక్ష్మి నారాయణ, స్థానిక ఎంపీటీసీ లు బాబు రావు, తహసీల్దార్ పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి, సీఐ రామకృష్ణ రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు రావు, వైసీపీ నాయకులు చంద్ర, మోషీ, అత్తి పల్లి అనూప్ రెడ్డి వేమరెడ్డి, నీలపరెడ్డి ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖ అధికారులు, సచివాలయం సిబ్బంది, పడుగు పాడు పంచాయతీ కార్యదర్శి కృష్ణ మూర్తి, వాలంటీర్స్ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో పంట నష్టం వివరాలను నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర - నెల్లూరు: మాండస్ తుఫాన్ కారణంగా నష్టపోయిన పంట వివరాలను రైతులు కందు కూరులో స్థానిక రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ రావు తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ నందు ధరల స్థిరీకరణ పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, గిట్టుబాటు ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. తుపాన్ కారణంగా కందుకూరు నియోజకవర్గంలో మినుములు, శనగలు, మిర్చి , పంటలు తీవ్రంగా నష్టపోయామని రైతులు సమావేశంలో వివరించారు. అదేవిధంగా పత్తి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాలు పాలవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సరైన గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. సమావేశంలో చర్చించిన విషయాలను ఉన్నతాధికార దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని రైతు బజార్ ను త్వరలో ప్రారంభించినట్లు వివరించారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ శాఖ ఏ డి ఏ శేషగిరిరావు, ఏవోలు, హార్టికల్చర్ శాఖ అధికారులు, సేంద్రియ వ్యవసాయ అధికారులు, రైతులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

నీలగిరి సంఘంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజక వర్గం పరిధిలోని 35వ డివిజన్ నీలగిరి సంఘంలో హైబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈనెల 20న ఏసీ స్టేడియంలో పెద్ద ఎత్తున ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నామని అందులో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని కోరారు.

రాష్ట్రం ఆర్థికంగా చీకటిమయం
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: రాష్ట్రాన్ని ఆర్థికంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృంగదీశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్ అన్నారు. బుధవారం నెల్లూరు లోని రామకోటయ్య భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రాలోని డ్రగ్స్ మాఫియాను అరికట్టాలన్నారు. మాండోస్ తుఫాన్ బాధితులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు నెలసరి వేతనాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జగదీష్ అన్నారు. దేశంలో మన రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ మాఫియా చెలరేగుతోందన్నారు. కోస్టల్ కారిడార్ ఏరియా, పోర్టులు కేంద్ర ప్రభుత్వం ఆదానికి అంకితం చేయడం ద్వారా డ్రగ్స్ మాఫియా పేట్రేగిపో తోంద న్నారు. ఈ మాఫియాని అరికట్టాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలాది అని డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు సర్వనాశనం అవుతుందన్నారు. ఈ మాఫియా ను అరికట్టకపోతే ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించలేక రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా కుంటుపడిందంటే దానికి కారణం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పోరాటానికి సిపిఐ బాసటగా నిలుస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కోట్లాది రూపాయల టెండర్లను నామినేటెడ్ పద్ధతిలో వారి పార్టీ కార్యకర్తలకు అందచేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రైతు సంఘం జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ మండుస్ తుఫాన్ వల్ల రైతాంగం పండించిన పంటలు పూర్తిగా నష్టపోయారని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సామాన్య ప్రజలు కూడా నష్టపో యారని, వీరందరినీ ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి అని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇప్పటికే ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇందుకు నిదర్శనమే ఇటీవల జరిగిన ఎన్నికలలో బిజెపి తిరిగి ప్రచారం చేసినా గెలుపు నామమాత్రంగానే ఉందన్నారు. జరిగిన పలు ప్రాంత పలు రాష్ట్రాల శాసనసభ పార్లమెంటు ఎన్నికలలో బిజెపి అభ్యర్థులు పూర్తిగా విఫలమ య్యారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల సంబంధించిన తుఫాను వర్షాల వల్ల పలు ప్రాంతాలలో రైతులకు పూర్తిగా దెబ్బతిన్నారన్నారు. నెల్లూరు జిల్లాలోని కందుకూరు, ఆత్మకూరు, కావలి, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన భూములను రామాయపట్నం పోర్టు నిర్మాణం పేరుతో కారు చౌకగా కొనుగోలు చేయడమే కాకుండా వారికి తగిన జీవనోపాధి చూపకుండా చేస్తున్నారని ఆయన అన్నారు. జిల్లాకు చెందిన మంత్రి ప్రజా ప్రతినిధులు ఈ ప్రాంతంలోని బడుగు, బలహీన వర్గాలు సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తారన్నారు. అంతకు ముందు జిల్లా కార్యవర్గ సమావేశంలో రావుల వెంకయ్య, డి జగదీష్ పాల్గొని జిల్లాలో వాటిని ప్రజా సంఘాలను పటిష్ట చేయాలని అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులంతా పార్టీ ప్రజాసంఘాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని వారు సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజ మోహన్ రెడ్డి డిగ్రీ కళా శాలలో నో అవర్ హిస్టరీ (తెలుసుకో మన చరిత్ర) గుంటూరు వారు రూపొందించిన క్యాలెండర్ బుధవారం ఆవిష్క రించారు కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల నరసింహారెడ్డి క్యాలెండర్ ఆవిష్క రించారు. జిల్లా జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు షేక్ దస్తగిరి అహ్మద్ మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం కులాలకు మతాలకు భాషలకు ప్రాంతాలకు అతీతంగా అందరూ కలిసి పోరాడారన్నారు. ఈరోజు మనం అనుభవిస్తున్న స్వతంత్రం అమరవీరుల త్యాగ ఫలితం అని అన్నారు వారి ప్రాణాలను దేశం కోసం తృణప్రాయంగా అర్పించా రన్నారు. వారి బలిదానాలు భావి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకులు గాజులపల్లి రామిరెడ్డి మాట్లాడుతూ బి.ఆర్ అంబేద్కర్ ఎంతో కష్టపడి అధ్యయనం చేసి అందించిన రాజ్యాంగంలో దేశ ప్రజలు ప్రజలందరూ గౌరవించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆకుల నరసింహ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి అభ్యసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ గౌస్ బాషా, డిగ్రీ కళాశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థు లు పాల్గొన్నారు.

చెరువు తూమును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

విశాలాంధ్ర- సీతారాంపురం: మండలంలోని స్వామి చెరువు తూము నుంచి నీరు లీకు అవుతోందని కథనాలు రావ డంతో బుధవారం ఇరిగేషన్ డీఈ శంకర్ నారాయణ, ఏఈ విక్రమ్ లు స్వామి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ తూము మరమ్మతు లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటా మన్నారు. తూముకు సంబం ధించిన లీకేజి ఫొటోలను, తూము పరిస్థితులు ను ఉన్నత అధికారులు కు వివరించామన్నారు. తూము శాశ్వత మరమ్మతులు చేసేందుకు కలెక్టర్ కు నివేదిక పంపుతా మన్నారు.

వైసిపి పరిశీలకుడిగా ధనుంజయ రెడ్డి నియామకం శుభ పరిణామం

విశాలాంధ్ర- సీతారాంపురం: ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడిగా కొడవలూరు ధనుంజయ రెడ్డి ని పార్టీ అధిష్టానం నియమించడం శుభ పరిణామమని మాజీ జడ్పిటిసి దుగ్గిరెడ్డి గురువారెడ్డి, రాష్ట్ర బీసీ(భట్రాజు)కార్పొరేషన్ డైరెక్టర్, సీతారామ పురం బిట్-1 ఎంపీటీసీ పి.సి. అల్లూరు రాజు లు పేర్కొన్నారు. బుధవారం సీతారామపురంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలలోనీ వైసీపీలో ఉన్న అసంతృప్తులను బుజ్జగిస్తూ పార్టీ క్యాడర్ అందరిని కలుపుకొని వైసిపి బలోపేతానికి ధనుంజయ రెడ్డి రచించిన ప్రణాళికను తామంతా స్వాగతిస్తున్నామన్నారు. త్వరలోనే ఆయన పర్యటన నియోజకవర్గంలో ఉంటుందని అందరి అభిప్రాయాలను సేకరించి వారి నుండి సూచనలు సలహాలు తీసుకొని అసంతృప్తులను అందరిని ఏకతాటిపై తీసుకువచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. జనవరి నుండి వృద్ధాప్య పెన్షన్ రూ. 2750కు పెంచేలా క్యాబినెట్ తీర్మానం చేయడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నేలటూరి అబ్రహం, దేవి శెట్టిపల్లి మాజీ సర్పంచ్ రేనాటి సుధాకర్, నాయకులు కొండా రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సుమధుర్ రెడ్డి,రేనాటి లక్ష్మయ్య, మాల కొండయ్య పాల్గొన్నారు.

సైన్సు విజ్ఞాన సదస్సు విజయవంతం

విశాలాంధ్ర - గుడ్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , గుడ్లూరులో బుధవారం జరిగిన మండల స్థాయి సైన్సు విజ్ఞాన సదస్సు విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. సులోచన ఆధ్వర్యంలో ఎంఈఓ చంద్రమౌళేశ్వర్ రావు అధ్యక్షతన జరుగగా, ముఖ్య అతిథిగా జిల్లా సైన్స్ అబ్జర్వర్ ఏ.తిరుమలేష్ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా మాచవరం పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు మాల్యాద్రి , మునీర్ భాషాలు వ్యవహరించారు. సైన్సు విజ్ఞాన సదస్సు సందర్భంగా ఐదు రకాల ఈవెంట్స్ ను నిర్వహించగా అందులో ఇకో ఫ్రెండ్లీ ఈవెంట్ లో బసిరెడ్డిపాలెం హైస్కూలుకు చెందిన ఎస్.విక్రమ్ , హెల్త్, క్లీన్ లో జె.రామ్ చరణ్ (చినలాటిరిఫి) , సాఫ్ట్ వేర్, యాప్స్ లో ఎం.నితిన్ కుమార్ (గుడ్లూరు), ఎన్విరాన్మెంట్ క్లైమేట్ చేంజెస్ లో జీ.రమ్య (చేవూరు) , మ్యాథమ్యాటికల్, మోడలింగ్స్ లో డి. మధు సంధ్య (కేజీబీవీ, మొగుళ్లూరు) లు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి మెమొంటోలు మరియు సర్టిఫికెట్ లను ఎంఈఓ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపా ధ్యాయురాలు ఆర్.సులోచన మాట్లాడుతూ మొదటి స్థానంలో విజేతలుగా నిలిచిన ఐదు హైస్కూల్ ల విద్యార్థులను జిల్లాస్థాయి సైన్స్ ఫేర్ కు ప్రమోట్ చేయడం జరిగినదన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించుటకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు వి.మురళి , వెంకటేశ్వర్లు, శిరీష, కేశవ, మస్తాన్ లకు ప్రధానోపాధ్యాయురాలు సులోచన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కోవూరు గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు

విశాలాంధ్ర- నెల్లూరు: కందుకూరు మండలం లోని కోవూరు గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు కోవూరు గ్రామ సర్పంచ్ ఆవుల మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూ రు శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి సూచనల మేరకు అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. గ్రామంలో వీధి దీపాలు మరమ్మతులు గురైనట్లు గుర్తించా మన్నారు. మరమ్మతులు గురైన వీధి దీపాలకు మరమ్మతులు చేయించినట్లు వివరించారు. అదేవిధంగా రోడ్లు వెంబడి పిచ్చి మొక్కలను తొలగించినట్లు తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంక్ ను క్లోరిఫైడ్ ద్రావణంతో శుభ్రపరచినట్లు వివరించారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమా లు నిర్వహించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మిరప పంటను పరిశీలించిన శాస్త్రవేత్త

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలం లోని మిరప పంటను పొదలకూరు వ్యవసాయ పరి శోధనా స్థానం నుంచి తెగులు శాస్త్రవేత్త నాగమణి పరిశీలిం చారు. తుపాన్ కారణంగా భారి వర్షా లు పడటంతో బుధవారం రా పూరు మండలం లోని చుట్ట పా ళెం,నాయనా పల్లి గ్రామాల్లో ని మిరపపంటను శాస్త్ర వేత్త నాగమణి పరిశీలించి రైతు లకు పలుసూచనలు ఇచ్చారు ఈసందర్భంగా రైతులకు పోలం లో వుండే నీటిని తీసి వెసి, ఒక లీటర్ నీటిలో 3 గ్రాముల కాప ర్ అక్సి క్లోరైడ్ కలిపి మిరప మొ దలు లో పిచ్ కారి చేయాలని,ఇ లా చెస్తె పంట రికవరి అవుతుం దని రైతులకు తెలిపారు. వీరితో పాటు మండల వ్యవసా య అధికారి సోమసుందరం, గ్రామ వ్యవసాయ సిబ్బంది అనిత , రైతులు పాల్గొన్నారు.

నేడు సీఐ కార్యాలయంను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర- రాపూరు: జిల్లాల పునర్ విభజనలో భాగంగా రాపూరు మండలం సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం రావ డంతో, నూతన పోలీస్ సర్కిల్ కార్యాలయాన్నిగురువారం ఉదయం 10 గంటలకు వెంకటగిరి నియోజకవర్గ శాసన సభ్యు లు ఆనం రామ నారాయణ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిహెచ్ విజయరావు పాల్గొంటారన్నారు.

లాభదాయక కార్యాలయాల జాయింట్ కమిటీ సభ్యులుగా రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: లాభదా యక కార్యాలయాలపై జాయింట్ కమిటీకి జరిగిన ఎన్నికలల్లో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పార్లమెం టరీ బులెటిన్ పార్ట్ 2 నం. 62609 ద్వారా ప్రకటించారు. ఈ కమిటీలో 15 మంది సభ్యులు ఉంటారు. లోక్‌సభ నుండి పది మంది సభ్యులు, రాజ్యసభ నుండి ఐదుగురు సభ్యులు ఎన్నికవుతారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే నియమించబడిన కమిటీల కూర్పు, స్వభావాన్ని పరిశీలించడం ఈ కమిటీ ముఖ్య బాధ్యత. ఒక వ్యక్తిని లోకసభ లేక రాజ్యసభ సభ్యునిగా ఎన్నుకోవడం, కొనసాగించడం కోసం అనర్హులుగా ఏ కార్యాలయాలు ప్రకటించాలి, ఏ కార్యాల యాలు అనర్హులుగా ప్రకటించకూడదు అనే మొదలగు అంశాలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 102 ప్రకారం పరిశీలించటం ఈ కమిటీ బాధ్యతలలో ముఖ్యమైంది.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: మాజీ మంత్రి

విశాలాంధ్ర- మనుబోలు: మాండోస్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులనుబేషరతుగా ఆదుకోవాలని మాజీ మంత్రి సోమిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మనుబోలు మండలం వెంకన్నపాలెం సమీపంలో నారుమడులు మునిగిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాండోస్ తుఫాన్ తో నారు మడులు మునిగి తీవ్ర నష్టాలు పాలు అయినా రైతులను వ్యవసాయ శాఖ మంత్రి పట్టించుకోవవడం లేదని విమర్శించారు. సుమారు 5 ఎకరాల వరకు నారు మడులు మునిగిపోయాయని మినుమ రైతులు కూడా తీవ్ర నష్టాలు పాలయ్యారని తెలిపారు. ఇంతవరకు వ్యవసాయ శాఖ మంత్రి గాని, ఇరిగేషన్ అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు గాని, సచివాలయం సిబ్బంది గానీ నష్టాల పాలైన రైతులవైపు కన్నెత్తి చూసేవారు లేరని విమర్శించారు. మాండోస్ తుఫాన్ కారణంగా అసలు రైతులకు నష్టం జరగలేదని వ్యవసాయ శాఖ మంత్రి కలెక్టర్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. కందుకూరు కొండేపి ఉదయగిరి తదితర ప్రాంతాల్లో పొగాకు రైతులు కోట్లలో నష్టపోయారని వారిని వెంటనే ఆదుకోవాలని సూచిం చారు. ఉభయగోదావరి జిల్లాల్లో దాన్యం కొనుగోలు చేసే వారు లేక రోడ్లపై రాసులు పోసుకొని రైతులు నిరీక్షిస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి ఏంచేస్తున్నారని ప్రశ్నించారు.సబ్సిడీతో విత్తనాలు తీసుకున్న వారికే మరలా విత్తనాలు ఇస్తామని వాళ్లకే నష్టపరిహారం ఇస్తామని వైసిపి ప్రభుత్వం చెప్పడం దారుణమని అన్నారు. మాండోస్ తుఫాను తో వెంకటాచలం ,ముత్తుకూరు, మనుబోలు తదితర మండలాల్లో రైతులు తీవ్ర నష్టాలు పాలయ్యారని వారిని వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు వీధిన పడే పరిస్థితి వాటిలిందని ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోకపోతే టీడీపీ తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట గాలి రామకృష్టారెడ్డి, రామకృష్ణయ్య బొమ్మి సురేంద్ర,మస్తాన్ నాయుడు, శ్రీధర్ రెడ్డి, చల్ల గిరి, ప్రసాద్ ,సాని వెంకట రమణయ్య ,పద్మనాభరెడ్డి,ఎంట్రపాటి మహేంద్ర పాల్గొన్నారు.

వన్‌ధన్ వికాస కేంద్రం సందర్శన

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మండలంలో అటవీ ఫలసా యం పై జీవి స్తున్న 275 మంది గిరజన మ హిళచే 15 ఎస్ హెచ్ జి గ్రూపు లుగా ఏర్పాటు చేసిన ప్రదానం మంత్రి వన్ ధన్ వికాస్ యేజన కేంద్రాన్ని బుధవారం ఐటిడిఏ (యానాదులు) జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టరు రాణీ మందా వన్‌ధన్ వికాస యోజన కేంద్రాన్ని బుధవారం సందర్శిం చారు. ఈ సందర్భంగా సభ్యులైన గిరిజన మహిళలను సమా వేశ పరచి, ఔషధ గుణాలు కల్గిన అటవీ ఫలసాయ సేకరణ, అటవీ ఫల సంపదను అమ్ముకొని జీవనం సాగించేందుకు హాట్ బజార్ ఏర్పాటు విషయమై చర్చించారు. ఈ సందర్శనలో ఐ.టి. డి.ఏ కార్యాలయపు అభివృద్ధి అధికారి యు. శ్రీని వాసులు, ఇతర వి.డి. వి.కె. సభ్యు లు పాల్గొన్నారు.

నేటి నుండి సహస్ర చండీ మహాయాగం

విశాలాంధ్ర - కావలి : డిసెంబర్ 15 నుండి డిసెంబర్ 22 వరకు కావలి పట్టణంలోని స్కంద ఫ్రైడ్, వరాహ వెంచర్స్ లో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సహకారంతో స్టార్ పొలిటీషియన్, వైసీపీ సీనియర్ నాయకులు మన్నెమాల సుకుమార్ రెడ్డి నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం 4.09 నుండి 22వ తేదీ గురువారం వరకు సప్తాహ దీక్షతో శ్రీ సహస్ర రుద్ర సహిత చండీ మహా యాగం అత్యంత వైభవంగా శాస్త్రోత్తముగా నిర్వహించనున్నారు. 15వ తేదీ యాగశాల ప్రవేశ పూజ, 16వ తేదీ శైలపుత్రి అలంకారం, 17వ తేదీ బ్రహ్మచారిణీ అలంకారం, 18వ తేదీ చంద్ర ఘంట అలంకారం, 19వ తేదీ ఉదయం కూష్మాండ, సాయంత్రం స్కంద మాత అలంకారం, 20వ తేదీ ఉదయం కాత్యాయినీ అలంకారం, సాయంత్రం కాళరాత్రి అలంకారం, 21వ తేదీ ఉదయం మహాగౌరి అలంకారం, సాయంత్రం సిద్ధిదాత్రి అలంకారం, 22వ తేదీ చండీ అలంకారం చేయనున్నారు. ప్రతి రోజూ పెద్ద ఎత్తున హోమాలు, పారాయణాలు నిర్వహించనున్నారు. మదభినవోద్ధండ విద్యా శంకర భారతి మహాస్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణా దివ్య ఆశీస్సులతో పూజ, యాగ, హోమ క్రతువులను ఆగమ శాస్త్ర జోతిష్య వాస్తు సిద్ధాంతి కొండూరు శివకుమార్ శాస్త్రి, శాస్త్ర సంస్కృత పండితులు గండికోట రమేష్ శర్మ ఆధ్వరంలో నిర్వహిస్తున్నారు. అత్యంత పవిత్రమైన అరుదుగా మాత్రమే జరిపించే సహస్ర చండీ యాగాన్ని కావలి పట్టణంలో నిర్వహిస్తున్నామని, పవిత్రమైన జగన్మాత యాగంలో ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా పాల్గొని సుకుమార్ రెడ్డి దంపతులు కోరారు.

కొట్టుకుపోయిన సప్లై ఛానల్‌ను యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలి

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: గత ఏడాది జిల్లాలో సంభవించిన భారీ వర్షాలు, వరదల్లో కొట్టుకు పోయిన విరువూరు సప్లై ఛానల్ ట్రఫ్ ఆక్వడక్ట్ కమ్ సూపర్ పాసేజ్ (థోనే)ను యుద్ధ ప్రాతిపదికన నిర్మించి అన్నదాతలకు సాగునీరు అందించడం తనకు ఎంతో ఆత్మసంతృప్తినిచ్చిందని రాష్ట్ర వ్యవసా యు, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం పొదలకూరు మండలం విరువూరులో కనుపూరు కాలువ వద్ద రూ. 1.06 కోట్లతో పునర్నిర్మించిన విరువూరు ఛానల్ ట్రఫ్ ఆక్వడక్ట్ కమ్ సూపర్ పాసేజ్ (థోనే)ను, 20 లక్షల గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సైడ్ కాలువలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సూపర్ పాసేజ్ ను అనతి కాలంలోనే పూర్తిచేసి ఈ వ్యవసాయ సీజన్ లో రైతులకు సాగునీరు అందించేందుకు అధికారులు అహర్నిశలు శ్రమిం చారన్నారు. ఈ థోనె ఏర్పా టు తో సుమారు 1400 ఎకరాలకు సాగునీరు లభించ నుంద న్నారు. గతంలో కండలేరు లెఫ్ట్ ఇరిగేషన్ కెనాల్ ను ఆనం వెంకట్ రెడ్డి హయాంలో నిర్మించగా, కనుపూరు కాలువను మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పూర్తి చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు సంబంధించి ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని, కేవలం కండలేరు లెఫ్ట్ కెనాల్ లో నీటిని ఎత్తిపోసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లను మాత్రమే ఏర్పాటు చేశారని, ఆ లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లను కూడా వినియోగించే అవస రం రాకుండా రాష్ట్రమంతా వర్షాలు పుష్కలంగా పడి రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. మాండౌస్ తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని, అన్నదాతల శ్రేయస్సే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం తాటిపర్తి పంచాయతీ వరదాపురంలో రూ 30 లక్షల నుడా నిధులతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను మంత్రి ప్రారంభిం చారు. మంత్రి వెంట జలవనుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రాజు, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఆర్డీవో మలోల, ఎంపీడీవో నగేష్ కుమారి, తహశీల్దార్ ప్రసాద్, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు ఉన్నారు.

స్కూలు భవనాలను పరిశీలించిన జనసేన నాయకులు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: జిల్లా పరిషత్ స్కూల్ కట్టుబడి ప్రాంతంలో నిర్మాణం కూలిపోయిందన్న విషయం తెలుసుకున్న జనసేన ప్రధాన కార్యదర్శి,నాయకులు ఆ ప్రాంతాన్ని సందర్శిం చారు. ఆ ప్రాంతానికి వెళ్లేసరికి ఉదయం కూలిన నిర్మాణం ఆనవాళ్లు కనబడకుండా పూర్తిగా శుభ్రం చేసి కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. ఆ ప్రాంత మంతా అసలు అక్కడ ఏమి జరగనట్లు వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గును కుల కిషోర్ మాట్లాడుతూ సొంత భవనాలను ఎంతో ఇంట్రెస్ట్ తో పెద్ద నిర్మాణ సంస్థలకి అప్పజెప్పి ఎంతో విలాసంగా కట్టుకుంటున్న వైసీపీ నాయకులు ప్రజాధనంతో పేదల పేద ప్రజల చదువుకు ఉప యోగపడే స్కూలును లోపం భూష్టంగా నిర్మాణించటం అన్యా యమన్నారు. నిర్మాణం లో కూలీలు, మేస్త్రీలు మాత్రమే ఉన్నారు .కానీ నాణ్యతను పరిశీలించడానికి సూపర్వైజర్లు గాని మరే ఇతర నిర్మాణ సంస్థలు గాని అక్కడ లేకపోవడం పరిశీలిస్తే ఎంత నిర్లక్ష్యం గా వైసిపి నాయకులు ప్రవర్తిస్తున్నారని అర్థమవుతుందని తెలిపారు. స్కూల్ నిర్మాణం మొత్తం స్కూలు యాజమాన్యానికి అప్పజెప్పి చేతులు దులుపుకుంటున్న వైసీపీ నాయకులకి ఏమాత్రం జవాబు దారితనం లేదని తెలిపారు. అనంతరం స్కూల్ ఆవరణలో మూడు నెలలకే చిరిగిన జగనన్న కానుక స్కూల్ బ్యాగుల్ని పరిశీలించి ఎంత లోపభూయిష్టంగా ఉన్నా యనేది తెలియజేశారు. వైసీపీ అధికారం లోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ వైద్య విధానాన్ని నిర్వీర్యం చేస్తున్న తరు ణంలో స్థానికంగా దాదా పుగా 900 మంది పైచి లు కు ఉన్న విద్యార్థుల కోసం నిర్మిస్తున్న భవనం విషయంలో ఎంత జాగ్రత్తగా వ్యవహరిం చాలని మర్చిపోయి వ్యవహరిస్తున్నారు ఈ వైసీపీ నాయ కులని తెలిపారు. ఇప్పటికైనా నాయకులు మేలుకొని స్థానికంగా కట్టుబడి లోపం వల్ల కూలిపోయిన నిర్మాణం తాలూకు అవగాహన లోపాన్ని గమనించుకొని సరిదిద్దుకొని నాణ్యత పరిమాణాలను పరిశీలించి నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. రానున్న రోజుల్లో ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించ వలసిన పాఠశాలను జవాబు దారీతనంతో వ్యవహరించి జాగ్రత్తగా నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, కంథర్, అమీన్, అలేఖ్, ఖలీల్, ప్రసన్న, మౌనేష్, ఇంతియాజ్, షాజహాన్, హేమంత్ యాదవ్ పాల్గొన్నారు.

జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: దేశంలో ఇంధనాల వృథాను అరికట్టి, ఇంధన పొదుపు కోసం ప్రభుత్వం కార్యక్రమాలను చేపట్టాలని సినీ దర్శకుడు మహేష్ చంద్ పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నెల్లూరు కొండాయ పాలెం లోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇంధనం పొదుపు చేస్తే -ఇంధనాన్ని ఉత్పత్తి చేసినట్లే' అనేది పరిరక్షణగా భావించాలని కోరారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షుడు కె. మురళీమోహన్ రాజు మాట్లాడుతూ జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం యేటా డిసెంబర్ 14వ జరుపుతారు. 1991నుండి కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ దినోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పేర్నపాటి శ్రీరామరాజు ప్రధానోపా ధ్యాయులు భాస్కర్ రావు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో 'ఇదేమి ఖర్మ?'

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మేజర్ పంచాయతీ లోని రాపూరు పాత వారిజన పాళెంలో టీడీపీ మండల అధ్యక్షులు దందోలు వేంకటేశ్వరరెడ్డి పర్యవేక్షణలో పట్టణ అధ్యక్షులు షేక్ ముక్తార్, మండల మహిళా అధ్యక్షురాలు రవణమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సి కాలనీలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రాని కి'ని నిర్వహించారు. ఇంటింట "కి తిరిగి 3 సంవత్సరాల పాలనలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీ లేదని తెలిపారు. టీడీపీ కరపత్రాలను అందజేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు అవుతు న్నా అభివృద్ధి ఏమి జరగలేదని రాపూరు మహిళా మండలి అధ్యక్షురాలు రవణమ్మ మండిపడ్డారు. ఈ వైఎస్ఆర్ ప్రభుత్వం హయాంలో పేదవారికి న్యాయం జరిగిన చరిత్ర లేదని ఈ ప్రభుత్వానికి ఓట్లు వేసినందుకు తామను తామే కొట్టుకోవాలని ప్రజలు అంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపూరు టీడీపీ మండల అధ్యక్షులు దందోల వెంకటేశ్వర రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎస్.కె. ముక్తార్, మహిళా మండలి అధ్యక్షురాలు రవణమ్మ, తెలుగు యువత అధ్యక్షులు అహ్మద్,పట్టణ ఉపాధ్యక్షులు డాక్టర్ వేణు, కిరణ్, తెలుగు యువత అధ్యక్షులు భాస్కర్, టీడీపీ నాయకులు పాల్గొన్నా రు.

దేశంలో గిరిజనులందరికీ మొబైల్ నెట్‌వర్క్ అందుతోందా?

లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ ఆదాల

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: 'దేశంలోని గిరిజనులు అందరికీ మొబైల్ నెట్‌వర్క్ కవరేజీ అందుతోందా?' అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి బుధవారం లోక్‌సభలో ప్రశ్నించారు. ఒకవేళ అందకుంటే తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర సమాచార ప్రసార శాఖామంత్రి దేవ్ సిన్ చౌహాన్ రాత పూర్వకంగా సమాధానం ఇస్తూ 2022 మార్చి నాటికి 1,20,613 గిరిజన గ్రామాలు ఉండగా, అందులో 1,00,030 గ్రామాలకు మాత్రమే మొబైల్ నెట్‌వర్క్ కవరేజ్ ఉందని తెలిపారు. ఇంకా 20,583 గ్రామాలకు ఈ సౌకర్యం కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. ఇవన్నీ వాణిజ్య పరంగా లాభదాయకం కాని, తక్కువ జనాభా ఉన్న కఠినమైన ప్రాంతాలని పేర్కొన్నారు. ప్రభుత్వం, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు దశలవారీగా కనెక్టి విటీని అందిస్తారని తెలిపారు. ఇందుకు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్ కు భూమి పూజ

విశాలాంధ్ర - గుడ్లూరు: మండల కేంద్రమైన గుడ్లూరులో కొత్తపేట గ్రామానికి వెళ్లే రహదారిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్ కు బుధవారం ఉదయం భూమి పూజ నిర్వ హిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుడ్లూరు ఎమ్మార్వో వి.లావణ్య, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసులు రెడ్డి, ఎంపీపీ పులి రమేష్, హార్టికల్చర్ అధికారి బ్రహ్మసాయి, డిఆర్డిఏ ఏరియా కోఆర్డినేటర్ వసుంధర దేవి, ఏపిఎం అశోక్ బాబు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యదర్శి ఆలూరి వెంకట హనుమంతరావు మాట్లాడుతూ 15 లక్షల రూపాయలు నిధులతో 75 శాతం హార్టికల్చర్, 25 శాతం రైతు ఉత్పత్తిదారుల సంస్థ నిధులతో కలెక్షన్స్ సెంటర్ ను ఏర్పాటు చేసుకోవడానికి స్థానిక శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి కృషితో నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కలెక్షన్ సెంటర్ ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాల గురించి హార్టికల్చర్ అధికారి బ్రహ్మసాయి క్లుప్తంగా రైతులకు వివరించారు. రైతులకు సంబంధించి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో ప్రయో జనాలు ఉన్నాయని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏరియా కోఆర్డి నేటర్ వసుంధర దేవి తెలిపారు. కలెక్షన్ సెంటర్ ను గుడ్లూరు మండలానికి మంజూర య్యేలా కృషిచేసిన ఎమ్మెల్యే మహీధర్ రెడ్డికి గుడ్లూరు మండల రైతాంగం తరపున రైతు ఉత్పత్తి దారుల సంస్థ కార్యదర్శి హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, సభ్యులు రామరాజు, సిసి ఇందిరా, వెలుగు స్టాఫ్ జిలాని, రమాదేవి, వెలుగు వివోఏ లు, రైతు మిత్ర ఏడుకొండలు,అనిల్, పి బ్రహ్మయ్య, చిత్తారు మల్లికార్జున వెలుగు మహిళలు పాల్గొన్నారు.

సొంత గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర- మర్రిపాడు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సొంత గ్రామ మైన మర్రిపాడు మండలం బ్రహ్మణపల్లి లో 3వ రోజు శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి పర్యటిం చారు. ఈ సందర్భంగా పలు కాలనీలలో ప్రజలకు ప్రభుత్వం అంద చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిం చారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి అందచేసిన సంక్షేమ పథకాలకు సంబంధించిన సంక్షేమ లబ్ది కరపత్రాలను వారికి అందచేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపీడీఓ నాగమణి, నాయకులు అమర్నాథ్ రెడ్డి, పలు గ్రామాల సర్పంచ్ , ఎంపీటీసీ లు తదితరులు పాల్గొన్నారు. బ్రాహ్మణపల్లి లో జరిగిన గడపగడప కార్యక్రమం పై గురువారం రివ్యూ మీటింగ్ జరగనుంది ఈ మీటింగ్ లో గ్రామ సమస్యలు చర్చించి పరిష్కరించే దిశగా అధికారులను ఎమ్మెల్యే ఆదేశించనున్నారు.

విఎస్‌యు ఫలితాలలో ఎలాంటి తప్పిదం జరగలేదు: రిజిస్ట్రారు

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: గత రెండు రోజుల నుంచి వివిధ మాధ్యమాలలో వి ఎస్ యు ఫలితాల పై వస్తున్న కథనాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య పి రామచంద్రా రెడ్డి తెలిపారు. 800 మార్కులకు గాను 5,360 మార్కులు వచ్చినట్లు అనేక కథనాలు ప్రచురణమనవి ఒక ప్రైవేట్ వెబ్‌సైటు లో విడుదలైన ఫలితాలని, ఆ వెబ్‌సైటు శ్వవిద్యాలయం పరీక్షా ఫలితాలను విడుదల చేసేందుకు అధికారిక వెబ్‌సైటు కాదని తెలిపారు. సదరు విద్యార్థి ఫలితాలు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైటు లో ఎలాంటి తప్పులు దొర్లలేదని తెలిపారు. ప్రైవేట్ వెబ్సైటు లలో దొర్లిన కొన్ని సాంకేతిక లోపాల వలన అటువంటి అరుదైన ఫలితాలు రావటం జరిగిందని తెలిపారు. సదరు సాంకేతిక లోపాలను ఆ వెబ్సైటు వారితో మాట్లాడి సవరించటం జరిగిందని తెలిపారు. విశ్వ విద్యాలయ పరీక్షా విభాగానికి చెందిన అధికారుల తప్పిదం ఏమి లేదని తెలిపారు. ఇటువంటి తప్పుడు కథనాల వలన విశ్వవిద్యాలయం అపకీర్తి పాలుఅవుతుందని వాపోయారు. విద్యార్థులందురు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్సైటు లో విధులచేసిన ఫలితాలనే మాత్రమే ప్రామాణికం గా తీసుకోవాలని కోరారు.

పిల్లల పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): నగరం లోని స్థానిక చిల్డ్రన్స్ పార్క్ లో పచ్చదనాన్ని పెంచి, ఉత్సహాన్ని అందించే ఆట వస్తువులతో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతా వరణాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశిం చారు. అధికారులతో కలిసి చిల్డ్రన్స్ పార్కును కమిషనర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులోని వివిధ విభాగాలలో అవసరమైన ఏర్పాట్లను కమిషనర్ అధికారులకు సూచించారు. పార్కులో నూతనంగా నిర్మిస్తున్న జీవ వైవిధ్యం ప్రదర్శనశాల పనులను త్వరితగతిన పూర్తి చేసి పిల్లలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. మరమ్మతులకు గురైన పిల్లల ఆట వస్తువులు, క్రీడా పరికరాల స్థానంలో నూతన పరికరాలు ఏర్పాటు చేపట్టాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేసి పార్కులో పారిశుద్య నిర్వహణను ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక 17 వ డివిజన్ కార్పొరేటర్ పి.సుధాకర్, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ సంజయ్, డి.ఈ సురేష్ పాల్గొన్నారు.

రాళ్లపాడు రిజర్వాయర్ నీటిమట్టాన్ని పరిశీలించిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు దివి శివరాం, పార్టీ నేతలు బుధవారం రాళ్లపాడు రిజర్వాయర్ ను సందర్శించి నీటిమట్టాన్ని పరిశీలించారు. నీటి విడుదల గురించి అధికారులతో మాట్లాడారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడి, తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటల వివరాలు తెలుసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు వేముల గోపాల్, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెండ్ల వెంకట సుబ్బారావు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, మండల తెలుగురైతు అధ్యక్షుడు మద్దెల రామారావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాళ్లూరి ముసలయ్య, పార్టీ సీనియర్ నాయకులు గొల్లపల్లి వెంకటేశ్వర్లు, మాలకొండయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణం: మంత్రి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు మండలం విరువూరు గ్రామ జొన్నమిట్ట గిరిజన కాలనీలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి మంత్రి శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధితోపాటు, ఆలయాలను కూడా పట్టించుకోలేదని, టిటిడి సహకారంతో ఎస్సీ ఎస్టీ కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు ఏడు ఆలయాల నిర్మాణ పనులు మొదలుపెట్టామన్నారు. భక్తుల మనోభావాలకనుగుణంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు టీటీడీ సహాయ సహకారాలతో పెద్దపీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బరాయుడు, తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో నగేష్ కుమారి, సర్పంచ్ జగన్, మాజీ సర్పంచ్ సురేష్ కుమార్, బిట్రగుంట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ పిటి జగన్నాథం, సమరసత సేవ ఫౌండేషన్ సభ్యులు రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర- మర్రిపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీడ్స్ ఆధ్వర్యంలో మండల లెవెల్ లో విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యా యురాలు శివజ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 12 పాఠశాలలకు గాను ఆరు పాఠశాలల విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. క్విజ్ పోటీలలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు అందజేసినట్టు తెలిపారు. మండల లెవెల్ క్విజ్ పోటీలలో ఇద్దరిని ఎంపిక చేసి జిల్లా క్విజ్ పోటీలు ఈనెల 30వ తేదీ న దుత్తలూరు సీడ్స్ క్యాంపస్ లో నిర్వహిస్తారని ఆమె తెలిపారు.

విఆర్‌ఓల నిరసన

విశాలాంధ్ర- కోవూరు: విఆర్‌ఓలు 12డిమాండ్ లపై ప్రభుత్వం తో నిరసన కార్యక్రమం ల ద్వారా మూడవ రోజు కోవూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం భోజనం విరామం సమయంలో నల్ల బ్యాడజీలు ధరించి నిరసన తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారులు, సంగం జిల్లా నాయకులు పి. అశోక్ కుమారెడ్డి, నాగేశ్వరావు, ప్రసాద్ నాయుడు, జగదీష్ పాల్గొని వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కారం చేయాలన్నారు. 658 జీఓ ప్రకారం ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం లో మండలం అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు రెడ్డి కార్యదర్శి విజయకాంత్, జ్యోతి, సుజాత, జయశిల, రమేష్, జయరాజు, రమణమ్మ, జయరాజు, సుభాషిణి, నాగేశ్వరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పై రైతులకు పొలంబడి

విశాలాంధ్ర - కావలి : రూరల్ మండలం కొత్తపల్లి గ్రామంలో రైతు పురుషోత్తం వరి పంటలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీసిఎన్ఎఫ్ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ డి.మాల కొండయ్య పాల్గొని వరి పంటలో అధిక దిగుబడులు లక్ష్యంగా మిత్ర పురుగులను రక్షించు కోవడం, నిరంతర పంట విశ్లేషణ, విత్తనం నుండి విత్తనం వరకు పంటలపై పూర్తి పరిజ్ఞానాన్ని రైతులకు అందించడమే పొలం బడి లక్ష్యమని తెలిపారు. ప్రకృతి సేద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ బీజామృతంతో విత్తనశుద్ధి చేసు కోవాలని, నవ ధాన్యాలు చల్లి పంటలు వేసు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.కళావతి, మార్కెటింగ్ ఎం.టి. వై.పున్నారావు, శ్రీనివాసులు, శ్రీహరి, పురుషోత్తం, రమేష్, శ్రీకాంత్, వై.మాల్యాద్రి, కె.జగదీష్, కె.లక్ష్మి, శ్రీనివాసులు, సురేష్, మోష, మదన్ కుమార్, నాగేంద్ర బాబు, ప్రభాకర్, ఏపీసిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్ తో యువకుడు మృతి

విశాలాంధ్ర- మర్రిపాడు: మండల కేంద్రంలో కుంటా వెంకటేష్ (21) కరెంట్ షాక్ తో మృతి చెందాడు. కస్తూర్బా బాలికల స్కూల్ కి కొంత దూరంలో వెనుక భాగంలోని పొలంలో పనిచేస్తూ మంచి నీళ్ల కోసం పక్క పొలంలోకి వెళ్లేందుకు ఫినిషింగ్ దాటుతుండగా కరెంట్ సరఫరా రావడం తో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. పోస్ట్ మార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా వైద్యశాల కు తరలించారు.

18న విద్య వ్యాపారమా..? విద్యా హక్కు- పిల్లల భద్రతపై సదస్సు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఈ నెల 18 వతేదీ ఉదయం 10 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ మీటింగ్ హాలులో 'విద్య వ్యాపారమా..? విద్యా హక్కు- పిల్లల భద్రత' అంశంపై రాష్ట్ర తల్లిదండ్రుల సదస్సు జరుగుతుందని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నాయకులు పేర్కొన్నారు. ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ తరపున నెల్లూరు ప్రెస్ క్లబ్ లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో వారు మాట్లాడుతూ ఈ సదస్సులో రాష్ట్రంలోని విద్యార్థి విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొని జయప్ర దం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు శిఖరం నరహరి మాట్లాడుతూ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు మాజీ ఆంధ్ర రంజిత్ క్రికెటర్ మలిరెడ్డి కోటారెడ్డి అధ్యక్షత జరిగే ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రధాన వక్తలుగా రాష్ట్ర మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, శాసనమండలి సభ్యులు వి. బాలసుబ్రమణ్యం, పాఠశాల విద్య కమిషనర్, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కమిషనర్ నెల్లూరు కలెక్టర్, రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్మన్ , ఉన్నత, స్కూల్ రాష్ట్ర విద్యా నియంత్రణ, పరిరక్షణ కమిషన్ ల సభ్యులు, విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, జిల్లా పాఠశాల కళా శాల విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర విద్య సామాజిక వేత్తలు హైకోర్టు న్యాయవాదులు పాల్గొంటున్నారన్నారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్ష, కార్యదర్శు లు రావూరి రమేష్, ఉడతా రాజశేఖర్ యాదవ్ కె శ్రీనివాసరావు, సయ్యద్ జంషీద్, దాసరి కమలాకర్ వి, శ్రీకాంత్ రెడ్డి, హరిందర్ రెడ్డి పాల్గొన్నారు.

వరి పొలాలు పరిశీలన

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డి పాలెం: బుచ్చిరెడ్డిపాలెం మండ లంలోని పంచేడు , పెనుబల్లి గ్రామాలలో వర్షాల కు నార్లు, వరి నాట్లు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం 80 శాతం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం. సురేంద్ర రెడ్డి తెలిపారు.మండూస్ తుఫాన్ కారణంగా దెబ్బ తిన్న వరి పొలాలను సందర్శించారు. రైతులు పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే తొలగించుకోవాలన్నారు. నాటిన వరి కుళ్లి ఉన్నందున నివారణకు కార్బండిజమ్ 2 లేదా 3 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల సమస్యను నివారించుకోవచ్చునని తెలిపారు. పంట దెబ్బతిన్న రైతులకు ఆర్బికెల ద్వారా వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నం దున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వాలు: టీడీపీ

విశాలాంధ్ర-ముత్తుకూరు: మాండో స్ తుపాన్ కారణంగా నష్ట పోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోకుండా వదిలేసిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో తుఫాన్ కారణంగా గురైన ప్రాంతాలను బుధవారం సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యటించారు.. ఆముదాల పాడు, బ్రహ్మదేవం, బండ్లపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. బ్రహ్మదేవుని ఆయన నారుమడి మునిగిపోయిన రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాండోస్ తుఫాన్ కారణంగా ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ జిల్లాలలో తుఫాన్ ప్రభావం అధికంగా ఉండడంతో రైతులు అధికంగా నష్టపోయారని ఆయన తెలిపారు. పొగాకు సుమారు రెండు లక్షల ఎకరాల్లో పొగాకుపూర్తిగా పాడైపోయిందని, అందువల్ల రైతులు అధికంగా నష్టపోయారు అన్నారు. అలాగే 4500 ఎకరాల్లో మినుము పంట దెబ్బతిందన్నారు. పెసర మామిడి పంటలకు కూడా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రాప్ చేసిన పంటలకే సబ్సిడీపై విత్తనాలు పంపిన అని చెబుతున్నారని అయితే సచివాలయంలోని ఉద్యోగులు అనేకమంది రైతుల పంటను ఈ గ్రాఫ్ చేయలేదని తెలిపారు. 5000 ఎకరాల్లో నార్మల్ దెబ్బతిన్నాయని, మరో ఐదు వేల ఎకరాల్లో నాట్లు వేసిన పంట దెబ్బతిన్నదని అయితే నేటికీ అధికారులు నష్టపరిహారాన్ని రికార్డు చేయకపోవడం విచారకర మన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి నేటికీ వరద ప్రాంతాల్లో పర్యటించకోక పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, తీపి గూడూరు నాయకులు బొమ్మిసురేంద్ర, మండల నాయకులు ఏ కొల్లు కోదండరామయ్య,, విష్ణువర్ధన్ రావు, కొత్తపల్లి రమేష్, నన్ను దీనయ్య, రవీంద్ర, రవి, అలిముత్తు, సీనయ్య పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ 33 వ డివిజన్ వెంగళరావు నగర్ లో గతంలో జనసేన పార్టీకి క్రియాశీలకంగా పని చేసిన అరవ విజయ్ కాంత్ మొదటి జయంతి సందర్భంగా స్థానికంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జన సైనికులు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సేవా దృక్పథంతో చేసిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు ఎంతో అభినందించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు గునుకుల కిషోర్ మాట్లాడుతూ జనసేన నాకేం ఇచ్చిందని ఎవరైనా అడిగితే అంతులేని అభిమానం పంచే తమ్ముళ్లనిచ్చిందని చెప్పుకుంటానని, తోడబుట్టిన వాళ్ళిద్దరైతే తోడు నడిచే వాళ్ళు ఎంత మందో లెక్క కూడా పెట్టలేకున్నానని తెలిపారు. ఇంతమంది అభిమానించే తమ్ముళ్ళను ఇచ్చినందుకు పవన్ కళ్యాణ్‌కి ధన్యవాదాలు తెలియజేస్తూ ఆయన ఆశయ సాధనకు వారధిగా వ్యవహరిస్తున్నానని తన వెనుక నడిచే తమ్ముళ్ల అందరికీ మార్గదర్శకంగా నడుచుకుంటానని తెలిపారు. అరవ విజయ్ కర్ర సాము వంటి కళలలో ప్రవీణ్యం గల సోదరుడు తక్కువ వయసులోనే మాకు దూరవడం నిజంగా దురదృష్టమని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ సోదరుని స్మృ తి నివాళులర్పిస్తూ జనసేన పార్టీ తరపున చిన్న రాజా బ్లడ్ క్యాంప్ అరేంజ్ చేసి దాదాపు 50 యూనిట్ల రక్తాన్ని అందించడం అభినందనీయమని తెలిపారు. విజయ్ కాంత్ గతంలో జరిగిన జనసేన కార్యక్రమంలో చురుకులుగా పాల్గొనే వారిని నెల్లూరు రూరల్ లో జనసేన కి గట్టిగా పట్టున్న ప్రాంతం 33 వ డివిజన్ అనీ రానున్న రోజుల్లో జనసేనకి పట్టం కట్టే విధంగా అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం జనసేన స్థానిక నాయకుడు అరవ చిన్న రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, వినోద్, జాన్ పాల్, ఉద్దేష్, మిధున్, కంథర్, అమీన్, అలేఖ్, ఖలీల్, ప్రసన్న, ఇంతియాజ్, షాజహాన్, హేమంత్ యాదవ్,శంకర్ పాల్గొన్నారు.

జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: వి.యస్. యస్. సి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వ హించారు. దీనికి ముఖ్య అతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మధుబాబు హాజరు అయ్యా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంధన సామర్థ్యం, దాని పరిరక్షణపై అవగాహన నేటి తరం కలిగి ఉంటేనే అది భావితరాలకు తెలుస్తుందని పేర్కొన్నారు. సీనియర్ అధ్యాపకులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంధన వృథా - జాతికి వృథా - మనం శ్రమించలంటే శక్తి అవసరం అన్నారు. ఏ వస్తువు పనిచేయాలన్న దానికి తగిన ఇంధనం కావాలని అందుకే ఇంధనాన్ని పొదుపు చేయవలసిన ఆవశ్య కతను అందరిపై వుందన్నారు. ఫిజిక్స్ విభాగ అధిపతి రాజ మాట్లాడుతూ ఇంధనాలు వృథా చేస్తే అవి రాబోయే తరాలకు దొరక కుండా పోయే అవకాశం ఉందన్నారు. ఈ సంద్భంగా గోడపత్రిక పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులు హర్షవర్ధన్,మధన్ తయారు చేసిన సోలార్ సైకిల్ చూపులను ఆకట్టుకుంది. ఈ సందర్భంలో వాళ్ల ఇద్దరిని అధ్యాపకులు అభినందిం చారు. ఈ కార్యక్రమం చివరన జె.సుబ్రమణ్యం వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు తుఫాన్ నష్టపరిహారం రూ.30 వేలు చెల్లించాలి

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డిపాలెం: జిల్లాలో నాలుగు రోజులు పాటు మాండూస్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు 30 వేల రూపాయలు చెల్లించాలని ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు కార్యదర్శి లు పుత్తైటి మల్లికార్జున,.గండవరపు ప్రవీణ్, పెంచలయ్య, కోసూరు లక్ష్మయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఈ సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మినగల్లు, జొన్నవాడ, పెనుబల్లి, కాగులపాడు, దామర మడుగు గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగి తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రైతులు ఇప్పటికే తమ పొలాల మీద 15 వేల నుంచి 25 వేల ఖర్చు పెట్టారని కౌలు రైతులు అయితే కౌలుతో కలిపి సుమారు 35 వేల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది అని తెలిపారు. ప్రభుత్వం వీరిని వెంటనే ఆదుకోవాలని వారి కోరారు. గత ఏడాది పెన్నానది కి వచ్చిన వారదలు కారణంగా పొర్లు కట్టలు తెగి ఆ గ్రామాలను ముంచెత్తయని ఆ సందర్భంలో పంట కాలువలు పూడిపోవడం వల్ల మాండూస్ తుఫాను కారణంగా వచ్చిన వర్షాలతో వర్షపు నీరు పొలాలను ముంచెత్తా యని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పంటకాలాలను తవ్విం చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విస్సా మునస్వామి, బిల్లా రఘు రామయ్య, ఏడుకొండలు, పోతంశెట్టి శ్రీనివాసులు చల్లకొలుసు మల్లికార్జున పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం మానవాళికి ప్రమాదం

విశాలాంధ్ర - కావలి : సమాజంలో మాదకద్రవ్యాలు వినియోగించడం ద్వారా యువత నిర్వీర్యం అవుతుందని కావలి న్యాయస్థానాల మాదకద్రవ్యాల వినియోగం నిషేధ చట్టం సలహా సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం మాలకొండారెడ్డి మాట్లాడుతూ యువత నల్లమందు, గంజాయి, బ్రౌన్ షుగర్ వంటి మత్తు పదార్థాలు సేవించడం వల్ల యువత నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పౌర సంస్థలు, ఎక్సైజ్ శాఖ కలిసి కట్టుగా గ్రామాల్లోని ప్రజలకు, యువతకు మత్తు పానీయాలు సేవించడం వల్ల కలిగే దుష్ఫలితాల పై అవగాహన కల్పించి ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే విధంగా కృషిచేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

రైతులు సర్వం కోల్పోతున్నా ఈ ప్రభుత్వానికి పట్టదా?

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



విశాలాంధ్ర- వలేటివారిపాలెం: భారీ వర్షాలకు నష్టపోయిన రైతుల బాధలు చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని, ప్రభుత్వం తక్షణం స్పందించి ఉత్తుత్తి ప్రకటనలు కాకుండా రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని, పొగాకు రైతులను ఆదుకునే విషయం లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పొగాకు బోర్డు, బ్యాంకర్లు స్పందించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దివి శివరాం, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీతో కలిసి పరిశీలించారు. వలేటివారిపాలెం మండలంలోని పోకూరు, కూనిపాలెం, నలదలపూరు కలవళ్ళ ప్రాంతాల్లో దెబ్బతిన్న పొగాకు, మినుము, మిర్చి పంటలను పరిశీలించారు. మోపాడు చెరువు గేట్లు సక్రమంగా లేక, వృథాగా పోతున్న నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ మాండూస్ ప్రభావంతో గోదావరి జిల్లాల నుంచి తిరుపతి వరకు రైతులు భారీగా నష్టపోయారన్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 1.35 లక్షల ఎకరాల్లో పొగాకు సాగవుతోందనీ. రైతులు ఒక్కో ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టారన్నారు. భారీ వర్షాల కారణంగా రూ. 600 కోట్ల నుంచి రూ.700 కోట్ల పెట్టుబడిని రైతులు నష్టపోయారని ఎకరాకు రూ.1.30 లక్షల వరకు రాబడిని కూడా కోల్పోయారని తెలిపారు. మొత్తం రూ.1500 కోట్లు పొగాకు రైతులు నష్టపోయారన్నారు. పొగాకు రైతును మాండూస్ తుఫాన్ కోలుకోలేని దెబ్బ కొట్టింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి రైతులు సర్వం కోల్పోతున్నా ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. పొగాకు రైతుల పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోతోందన్నారు. ఇంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పొగాకు బోర్డు, బ్యాంకర్లు స్పందించి వారిని ఆదుకోవాలని, పొగాకు క్రయవిక్రయాల ద్వారా ఇరువైపులా నుంచి 1 శాతం చొప్పున వసూలు చేసే సెస్ ద్వారా పొగాకు బోర్డు వద్ద రూ.700 కోట్ల వరకు నిధులున్నాయి. జీఎస్టీ రూపంలోనూ పొగాకు బోర్డుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల కారణంగా భారీగా ఆదాయం లభిస్తోంది. ఆ నిధులన్నీ రైతుల కష్టమే..ఇప్పుడు రైతులు భారీగా నష్టపోయి కష్టాల్లో ఉన్న నేపథ్యంలో ఆదుకోవడానికి బోర్డు ముందుకు రావాలన్నారు. రైతుల కోరిక మేరకు బోర్డు ఆధ్వర్యంలో ఒక్కో బ్యారెన్ కు రూ.50 వేలు చొప్పున వడ్డీ లేకుండా రుణాలు మంజూరు చేయాలి. బ్యారెన్ కు రూ.5 లక్షలు బ్యాంకర్లు రుణాలు ఇచ్చారు. ఆ రుణాలను రీ షెడ్యూల్ చేసి మళ్లీ పెట్టుబడికి సాయం చేయాలనే విన్నపాన్ని కూడా బ్యాంకర్లు పరిశీలించాలి. పొగాకుకు జీఎస్టీ వసూలు ద్వారా ఆదాయం పొందుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.20 వేలు చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. శనగ రైతులు కూడా ఎకరాకు రూ.25 వేలు నష్టపోయారని, కౌలు రైతులకు అదనంగా మరో రూ.15 వేలు వరకు నష్టం వాటిల్లింది. ఆ రైతులకు కూడా ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలి. మినుము, మిరప రైతులు కూడా భారీగా నష్టపోయిన నేపథ్యంలో ఎకరాకు రూ.30 వేలు పరిహారం అందజేయాలి. వరి పండించిన వారికి ఎకరాకు రూ.15 వేలు పరిహారం చెల్లించాలన్నారు. నష్టపోయిన వరి రైతులకు ఎలాంటి షరతులు లేకుండా, రాజకీయాలకు అతీతంగా విత్తనాలు ఉచితంగా అందజేయాలని, తడిచిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికైనా ఉత్తుత్తి ప్రకటనలు, అబద్దాల ప్రచారాలు ఆపి రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. పంట నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, వారందరికీ నష్టపరిహారం ఇచ్చేవరకు పోరాడుతామని నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెండ్ల సుబ్బారావు, రైతు నాయకులు ఘట్టం లేని చెంచురామయ్య, పొన్నగంటి రామయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పదవికి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అర్హులేనా..?

- ముస్లిం మైనారిటీ నేతల ధ్వజం

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టిడిపి నేత అల్లాబక్షుపై దాడితో పాటు మైనార్టీ నేత సాబీర్ ఖాన్ పై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ముస్లిం మైనార్టీలు నెల్లూరు విఆర్సి సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హటావో ముస్లిం మైనిరిటీ బచావో అని రూరల్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ మైనారిటీ అధికార ప్రతినిధి హయాత్ బాబా మాట్లాడుతూ ప్రజా సమస్యల పై ప్రశ్నించినందుకు, ముస్లిం నేతలపై, దాడులు చేయడం, అక్రమ కేసులు నమోదు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. మాట్లాడితే కేసులు పెట్టేస్తారా, ప్రశ్నిస్తే చంపేస్తారా అని ప్రశ్నించారు. శ్రీధర్ రెడ్డి ముస్లిం ల పై చూపే వివక్షత, గూండా వైఖరి మానుకోకపోతే, ఇన్ని రోజులు ముస్లిం ల అభిమానం చూశారని, ఇక పై ముస్లిం ల ఆవేశం చూస్తారని హెచ్చరించారు. ఈ సందర్భంగా నెల్లూరు పార్లమెంట్ టీడీపీ మైనారిటీ ఉపాధ్యక్షులు అల్లాభక్షు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న 31 వ డివిజన్ లో బాదుడే బాదుడు నిర్వహించి, ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తనపై దాడి చేయించారని రూరల్ ఎమ్మెల్యే స్వయానా తన అనుచరులతో కలిసి తాగేసి తనను చంపేయాలని కేకలు వేశారన్నారు. తనపై జరిగిన దాడి గురించి మైనార్టీ కమిషన్ కు, రాష్ట్ర డీజీపీ కి, జిల్లా ఎస్పీ, కలెక్టర్ కు ఆన్లైన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలి పారు. తన పై దాడి చేసిన వారిని తక్షణమే శిక్షించా లని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నగర మైనారిటీ టీడీపీ అధ్యక్షులు సాబీర్ ఖాన్ మాట్లాడుతూ శ్రీధర్ రెడ్డి కౌగిలి ధృతరాష్ట్రుడి కౌగిలి అని, అతని హస్తం భస్మాసురుడి హస్తమని విమర్శించారు. 430 మంది పిల్లల్ని చదివిస్తున్నారని గొప్పలు చెప్పుకునే శ్రీధర్ రెడ్డి కి తన పై అక్రమ కేసు నమోదు చేసినప్పుడు తన బిడ్డల భవిష్యత్తు కనపడలేదా? అని ఆవేదన వ్యక్తం చేశారు. తనకి, అల్లాబక్షు కి ఏదైనా హాని జరిగితే, దానికి పూర్తి బాధ్యత ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి దే నని, తమకేదైనా జరిగితే, మా కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఎవరూ ఊరికే ఉండరన్నారు. ఈ సందర్భంగా ముస్లిం ఉమెన్స్ ఎంపవర్మెంట్ ఫోరమ్ అధ్యక్షురాలు సయ్యద్ హబీబా మాట్లా డుతూ రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మురికి కాలువలో దిగారని, ప్రజలకు మరింత సేవ అందిస్తారని గెలిపిస్తే, ముస్లిం నేతల పై దాడులు, అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి చేసిన పనులు తన పెద్దరికానికి మచ్చ అని, అసలు ఆయన ఎమ్మెల్యే పదవిలో ఉండడానికి అర్హులేనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ నేతలు, జాఫర్ షరీఫ్, ఆసిఫ్ పాషా, మైనుద్దీన్, జహీర్, అస్లాం, సర్తాజ్, సత్తార్, ఇక్బాల్, ఇలియాస్, మునాఫ్ పాల్గొన్నారు.